

# సావిత్రమ్మ దాతృత్వం

షీలా శివరామ్

సావిత్రమ్మ ఇంటిపని చేసుకోలేక నానా బాధపడిపోతోంది. పనిమనిషి మానేసి పదిరోజులయింది. అది పోతూ పోతూ ఓ వాదువేసి మరీ పోయింది.

"సావిత్రిరమ్మ ఇంటో పనెక్కువ. ఫలితం తక్కువ. కనీసం ఇడిచిపారేసిన పాతకోకయినా పడెయ్యదు. ఓయమ్మో! మరో పదిరూపాయ లెక్కువిచ్చినా ఆ యింట్లో పనిసెయ్యడం శానా కష్టం," అంటూ ఓ వాదు లేవదీసి పోయింది.

అందులో నిజమెంతో అబద్ధమెంతో సావిత్రమ్మకి, ఆ వాదేసిన దానికి మాత్రమే తెలుసు.

"ఓసి నీ ఇల్లు బంగారంగానూ! తిన్నన్నాళ్లు తిని చేసినన్నాళ్ళు చేసి మరో ఇంట్లో మరో నాలుగు డబ్బు లెక్కువిస్తా ననగానే మానేసిపోవటమే! నీతీ, నిజాయితీ అక్కర్లా! పైగా వాదేసి పోతావా! అపభ్రంశపు మాటలతో వూరూ వాడా యాగీచేసి పోతావా! అందుకనే కూడూ గుడ్డాలేక మీ జాతి అట్టా ఏడుస్తోంది! ఇంత కింత అనుభవించక పోవులే" అంటూ మనసులో పనిదాన్ని కసిదీరా శపించింది సావిత్రమ్మ. ప్రత్యక్షంగా దాన్ని తిట్టి పంపిద్దామని కబురు పెడితే అది రాను పొమ్మంది నిర్లక్ష్యంగా.

అసలు ఇలాటి అలగాజనంతోనూ,

రౌడీజనంతోనూ మాట్లాడటం తనదే తప్పని సర్దుకుంది సావిత్రమ్మ.

రామసుబ్బమ్మగారి పనిదాన్ని అడిగితే పాతికిస్తావా అంది, దీని ఆశ పాడుగాను!

వెంకటలక్ష్మమ్మగారి పనిదానికి పాతికిచ్చి, రెండుపూటలా వేళ ప్రకారం కాఫీ, టిఫిన్లు పెట్టాల్ట! దీని మొహం మండ! ఇదేం పెళ్ళివారిల్లు అనుకుంది కాబోలు!

శేషమాంబగారి పనిదాన్ని కదిలిస్తే, హవ్వ! హవ్వ! ఆ పాతికేళ్ళ పడుచుగుంటని ఇరవైనాలుగ్గంటలూ ఇంట పెట్టుకు భరించాలట. దాని తిండితిప్పలే గాక, సబ్బు, పౌడర్లులాటి అలంకార సామగ్రికూడా సప్లైచెయ్యాల్ట! అదో కండిషనూ! ఇంకా నయం అంతటితో పోనిచ్చింది. మరేం అడగకుండా దాని పుణ్యవా అంటూ!

ఇది మరీ విడ్డూరం కాదూ! ఆ షోకిల్లా డైపిస్టు పారిజాతం పనిదంటుంది గదా, దానికి పై డబ్బక్కర్లేదట! ఇంట్లో పెట్టుకుంటే చాలట! వంటా, గింటా కూడా చేసిపెడుతుందిట! పైగా తను అవసరార్థం ఏ వూరన్నా పోతే అయ్యగారికి ఏ కష్టం కలక్కుండా వెయ్యి కళ్ళతో చూసుకుంటుందిట! హమ్మ! హమ్మ గుండెలు దీసిన బంటు గాదూ!

ఏతా, వాతా ఫలితం పదిరోజులయినా సావిత్రమ్మకి పనిమనిషి దొరకలేదు.

అంట్లగిన్నెలు తోమి, తోమి చేతులు ఎర్రగా కందిపోయాయి. బట్టలకి సబ్బు రాచి రాచి చేతులు బొబ్బలెక్కిపోయాయి. ఛా, ఛా ఇలాటి అలగా పన్లన్నీ వాళ్ళు చెయ్యాల్సిందే! మనకేం అలవాటా పాడా అనుకుంటూ నడుం నవరదీసుకుంది సావిత్రమ్మ.

* * *

'అమ్మా' అంటూ వీధిలోంచినొక్కేసినట్టుగా వున్న ఓ కంఠం వినిపించింది. సావిత్రమ్మ చేతిలోని అంటగిన్నెని దభేలున కిందపడేసి వీధిలోకి పరుగుతీసింది. ఏదో ఆశ! బుద్ధి తిరిగొచ్చి పనిమనిషి తిరిగొచ్చిందేమోనన్న ఆశ ఓ మూల ఏడిపిస్తోంది. సావిత్రమ్మ అదరాబాదరా తలుపుతీసి చూసింది. అది పాతమనిషి కానేకాదు. మరో కొత్త మనిషి.

సావిత్రమ్మ దాన్ని ఓసారి నఖశిఖ పర్యంతం పరీక్షించి మొహం చిట్లించుకుంటూ 'ఎవరూ?' అంది.

ఆ మనిషి చిరుగుల చీరతో, కప్పుకోవల్సిన శరీరభాగాల్ని సగం సగం మాత్రమే కప్పుకుంది. అతుకులేసిన చోటకూడా చిరిగిపోయిన రెవిక. కొబ్బరి పీచులాటి తలని గిరుకుని ముడేసుకుంది. పదిలంఖణాలు చేసినట్టుంది దాని మొహం.

'ఏం కావాలి?' అంది సావిత్రమ్మ చిరాగ్గా.

"పనిమనిషి కావాలా అమ్మా?" అందా మనిషి ఊపిరి లేనట్టుగా.

సావిత్రమ్మకి ఒక్కసారిగా ప్రాణం లేచొచ్చింది. ఆ చింపిరి బట్టల ఆకారం సర్వాభరణ భూషితురాలయిన సాక్షాత్ ఆ శ్రీమహాలక్ష్మే ఘల్లు, ఘల్లుమని గజ్జెలు చప్పుడు చేసుకుంటూ తనని అనుగ్రహించటానికి ఏతెంచినట్లు అని పించింది.

సావిత్రమ్మ తన సంతోషాన్ని పైకి పొక్కనివ్వకుండా జాగ్రత్త పడింది.

"ఇదివరకెక్కడ పనిచేశావు? చేస్తే అక్కడెందుకు మానేశావు? ఇల్లెక్కడ? పిల్లలెంతమంది? నీ మొగుడేం చేస్తాడు?" అంటూ దాన్ని నిలబెట్టి సవాలక్ష ప్రశ్నలేసింది సావిత్రమ్మ.

అది దాని హిస్టరీ అంతా మూడు ముక్కల్లో చెప్పేసింది. మొగుడు చచ్చిపోయాడు, ముగ్గురు పిల్లలు. అడుక్కోటానికి గూడా పనికిరానంత చిన్న గుంటలు. అది ఇంతవరకు పనిచేస్తున్న ఇంటివాళ్ళు బదిలీ అయి మరో వూరు వెళ్ళిపోయారు. అందుకని మరో పని కోసరం వెదుకుతోంది. అదీ దాని మాటల సారాంశం.

సావిత్రమ్మ దాన్ని పనికి పెట్టుకోటానికి అంగీకరించింది. అది చెయ్యాల్సిన పనంతా చెప్పింది ఇప్పటి వరకు ఇస్తున్న జీతాన్ని ఓ రెండు తగ్గించి చెప్పింది.

అది నిశ్శబ్దంగా వింటూ నిలబడిందల్లా, ఏ భావమూ లేనట్టున్న మొహాన్ని పైకెత్తి "పోయినదానికి మరో రెండు ఇచ్చేవారంట గదమ్మా?" అంది మెల్లగా.

సావిత్రమ్మ లోలోపల తత్తరబిత్తరలాడింది. అమ్మో ఆకారం పిచ్చవాలకంగా వున్నా అన్నీ తెలుసుకునే వచ్చిందన్నమాట!

"ఏదీ, పనితీరు చూడనీ. నచ్చితే మరి రెండు హెచ్చిస్తాలే!" అంటూ సర్దుకుంది. ఏది ఏమయినా దీన్ని చేజారిపోనీయకూడదు అనుకుంటూ బొబ్బలెక్కిన చేతుల్ని ఊదుకుంది.

సావిత్రమ్మ దానికి పెరట్లోకి దోవ చూపించి చెయ్యవలసిన పనులన్నీ చూపించింది. దాని పేరు రావమ్మ.

* * *

రెండు రోజులు గడిచిపోయాయి. సావిత్రమ్మకి రావమ్మ పని సంతృప్తిగానే వుంది. కాకపోతే అది దీక్షావస్త్రం లాగా విడవకుండా కట్టుకొస్తున్న ఆ చింకి చీరని చూస్తే మాత్రం వొళ్ళు జలదరిస్తోంది.

ఆ మురికి పాతని విడిచి మరోటి కట్టుకోదేం ఖర్మ. పాపం రెండో చీర గూడా లేదేమో! వాళ్ళేం మనకి మల్లే పొద్దున్న, సాయత్రం నీళ్ళోసుకుని



ట్రీమ్ముగా తయారవటానికి వీలేవుండే ఈ పాచి పని ఖర్మేం పట్టింది పాపం! ఏవిటో వెధవ జీవితాలు. ఇట్టాగే బ్రతుకుతూ, ఇట్టాగే రాలిపోతారు. ఏం లోకమో! ప్రతి మనిషికి పట్టెడు కూడు, జానెడు గుడ్డా ఇవ్వ లేకుండా వుంది. ఎప్పటికి వీళ్ళ బ్రతుకులు బాగుపడతాయో అంటూ బోలెడు జాలిపడింది. సావిత్రమ్మ లోకంమీద, పనివాళ్ళ మీదానూ.

సావిత్రమ్మ రెండు రోజుల్నుంచి అనుకుంటుంది రావమ్మకి తనదో పాత చీర ఇస్తే బాగుంటుందేమోనని. పాపం. పేదది. కట్టి విడవటానికి మరో గుడ్డ లేదల్లే వుంది. తనదో నడిపాత చీర పడేస్తే సంతోషిస్తూ కట్టుకుంటుంది. నమ్మకంగా పనిచేస్తుంది, అనుకుంది సావిత్రమ్మ.

రావమ్మ ఎఱ్ఱటి ఎండలో చమటలు దిగ్గారుకుంటూ గిన్నెలు తోమేటప్పుడు, బట్టలు వుతికేటప్పుడు సావిత్రమ్మకి దానికో పాత చీర పడెయ్యాలన్న అభిప్రాయం మరింత గట్టిపడేది జాలితో. ఒక్క చీరే ఏం ఖర్మ! పాపం ఓ రెవిక గూడా ఇస్తే బాగుంటుంది. పాపం దాని రెవికనిండా ఎన్ని అతుకులు, చిరుగులో! తనకేం బోలెడన్ని చీరెలు రెవికలు వున్నాయి. దానికి ఓ చీర, రెవిక పడేస్తే తన సంపదేం కరిగిపోదు గదా? మడి మాన్యాలేం కొట్టుకుపోవు గదా!

సావిత్రమ్మ ఆలోచన దారిలో వుండగానే మరో సంఘటన జరిగింది.

ఓ రోజు రావమ్మ వొంగుని ఇల్లు వూడుస్తోంది. సావిత్రమ్మ మొగుడు గడ్డంగీసుకుంటున్నవాడల్లా పెద్ద గా

కేకలు వేసుకుంటూ వంటగదిలో కొచ్చాడు.

"ఏమే సావిత్రీ, చూడు పాపం ఆ రావమ్మకి బొత్తుగా గుడ్డల్లేవల్లే వుంది. నీదో పాత చీర పడెయ్యక పోయావా?" అన్నాడు.

ఉన్నట్టుండి తన భర్తకి రావమ్మ విషయం ఎందుకు అరాకొచ్చిందో సావిత్రమ్మకి అర్థంకాలా. చటుక్కున గది లోకి తొంగిచూసింది. రావమ్మ వొంగుని గది వూడుస్తోంది. ఆడదయిన సావిత్రమ్మకే చప్పున సిగ్గేసింది ఎంత చింకి గుడ్డలు కట్టుకున్నా రావమ్మ వయసులో వున్న ఆడదే కదా!

"ఒసేయ్ రావమ్మా! పవిట సరిగ్గా వేసుకు ఏడవ్వే. నీ చింకి చీరా నువ్వూ పాడుగానూ" అంటూ కసురుకుంది.

"అసలయినా పనివాళ్ళవైపు మిమ్మల్నెవరు చూడమన్నారు. వయసుతో పాటు సరసంగూడా పెరుగుతున్నట్టుందే" అంటూ రుంజుమంది మొగుడి మీద.

సావిత్రమ్మ మొగుడు ఒక్క కేక పెట్టాడు. "నోరుమూసుకో పిచ్చి వాగుడు వాక్కు. కళ్ళెదురుగా అది చిరుగుల గుడ్డలతో కనిపిస్తుంటే ప్రత్యేకంగా చూడాల్సిన పనేముందే! నీకు మాత్రం కనపట్టంలా? ఆ స్టీలుగిన్నెల వాడికి బట్టలన్నీ దోచిపెట్టకపోతే, కళ్ళెదుట తిరిగేది దానికో పాత చీర తగలెయ్య కూడదూ" అంటూ రంకెలేసి, సలహా చెప్పి, స్నానానికి పోయాడు సావిత్రమ్మ మొగుడు.

ఆ సంఘటనతో రావమ్మకి ఓ పాత చీర ఇవ్వాలన్న అభిప్రాయం మరింత బలపడింది. సావిత్రమ్మ మనసులో జాలితో కాకపోయినా మరోవిధంగా.

ఆ సాయంత్రమే మరో సంఘటన కూడా సావిత్రమ్మ కళ్ళబడింది. తనని పిసినారిదని అపవాదు వేసిపోయిన తమ పాత పనిమనిషి, రావమ్మ రోడ్డు మీద మాట్లాడుతూ కంటబడ్డారు.

ఓ క్షణం సావిత్రమ్మ గుండెలు దడదడ లాడాయి. ఈ పిచ్చిముండ రావమ్మకి అదేవన్నా పురెక్కించి, వున్నవీ లేనివీ నాలుగు చెప్పి దీన్ని గూడా పని చెయ్యకుండా మానిపించదుగదా! అని అదటు పట్టుకొంది సావిత్రమ్మకి. పైగా తనమీద వున్న అపవాదు తొలగించుకోవటానికయినా తను దానికొక చీరన్నా దానం చెయ్యాల్సిన అవసరం అగత్యంగా కనిపించింది సావిత్రమ్మకి.

సావిత్రమ్మకి తనమీద పనివాళ్ళ జాతి వేసిన అభాండాన్ని తొలగించుకోవటానికి ఇదో మహదవకాశంలాగా తోచింది. పాపం చిన్నపిల్లలున్నారంటోంది. తన పిల్లలకి పొట్టయినవి, పాతబడినవి నాలుగు నిక్కర్లు, చొక్కాలు ఇస్తే సంతోషిస్తుంది చీరతో

చాటుగా. తన దాతృత్వం నలుగురికి వెల్లడయ్యే మహదవకాశం.

"నీ పిల్లల కెన్నేళ్ళే రావమ్మా?" అంటూ అజకనుక్కుంది. ఏడేళ్ళలోపు వాళ్ళని చెప్పింది రావమ్మ.

ఇంకేం! బాబిగాడి లాగులూ, చొక్కాలు నిక్షేపంలా సరిపోతాయి దీని పిల్లలకి అనుకుంది సావిత్రమ్మ.

మరునాడు పెట్టెలన్నీ తీరుబడిగా వెతికి తనదో నడిపాత చీర, రవిక, బాబిగాడివి పొట్టయిన రెండు నిక్కర్లు, చొక్కాలు తీసి విడిగా పెట్టింది.

"నువు వెళ్ళేప్పుడు చెప్పిపోవే రావమ్మా" అంది.

రావమ్మ పని పూర్తిచేసి పోబోతూ, "ప న యిం ద మ్మా" అంటూ కేక పెట్టింది.

"వుండు వ స్తు న్నా పో బో కు' అంటూ గదిలోకి వెళ్ళింది సావిత్రమ్మ. విడిగా పెట్టిన బట్టలు తీసి చేత్తో పుచ్చుకున్న సావిత్రమ్మ తల్లో తటాలున ఓ ఆలోచన తలెత్తింది. "అవునూ, ఇది వారం రోజులయి పని చేస్తుందె. నోరు తెరిచి ఒక్కనాడయినా "ఓ పాత చీర ఇప్పించమ్మా అనన్నా అడగలేదేం?! కనీసం దాని పిల్ల వెధవలకి ఓ పాత చొక్కాఅన్నా ఇవ్వమని అడగలేదేం! చూడబోతే చెట్టు సరిరకంగానే వుందే! పనిచేసేవాళ్ళకి ఇంత టెక్కా ఏం! సరే కానీ దానికే అంత అభిమానమయితే నాకుమాత్రం ఏం పట్టింది గరుజు. చూద్దాం దీని బెట్టు ఎంతవరకో" అనుకుంటూ చేతిలోని బట్టలన్నీ మళ్ళీ పెట్టెలో పడేసి బయటకొచ్చింది సావిత్రమ్మ.

"సరే, ఏంలేదులే. పో యింటికి" అంది లేచి నిలబడ్డ రావమ్మతో.

రావమ్మ వెళ్ళిపోయింది. సావిత్రమ్మ తల్లో మరో ఆలోచన కూడా మెరుపులాగా మెరిసి మాయమయింది. అసలు వీళ్ళు కనిపిస్తున్నంత పేదరికంతో బాధపడటం లేదేమో! ఇదంతా పై పై నటనేనేమో!

* * *

మరునాడు రావమ్మ పనిచేస్తూంటే సావిత్రమ్మ అడిగింది. "ఏమే రావమ్మా! వారంరోజులయి చూస్తున్నాను. ఆ మురికి చీర మార్చవు, వుతకవు. మరోటి కట్టవు. అట్టా మురిగ్గా పనికొస్తే ఎట్లాగే? అంది.

"మరో కోక లేదమ్మా" అంది రావమ్మ నెమ్మదిగా. ఈసారికూడా సావిత్రమ్మకి కావల్సిన సమాధానం రాక వొళ్ళు మండింది.

"ఏమో అనుకున్నాను. పొగరు మోతే!" అనుకుంది కోపంగా.

"ఇట్టా పనికొస్తే వూరుకునేది లేదు. ఆ చీర వుతుక్కుని, శుభ్రంగా పనికి రావాలి తెలిసిందా? ఇట్టా మురిగ్గా, అస

హ్యాంగా పనికొస్తే పూరుకోను. తెల్సిందా ?" అంది కోపంగా, గట్టిగా.

ఆ సాయత్రం రావమ్మ ఆ చిరుగుల మురికి చీరని సాధ్యమయినంతవరకు మురికి వదిలించి, ఉతికి ఆరేసి కట్టు కొచ్చింది. సావిత్రమ్మ పెదిమలు కొరు క్కుంది గట్టిగా.

రావమ్మ మల్లెపందిరికి నీళ్ళు పోస్తుం డగా, దాని చీర పందిరి వాసానికి చిక్కు కుని మరింతగా చిరిగింది. ఆ దృశ్యం చూసిన సావిత్రమ్మ మనసు జాలితో తలమునకలయింది. పాపం వెర్రిముండ అడిగినా అడక్కపోయినా చీర పడె య్యాల్సిందే పాపం" ప్రసూతి వైరాగ్యం లాంటిది పొంగుకొచ్చింది ఆ క్షణంలో సావిత్రమ్మకి.

ఆ సాయంత్రం రావమ్మ వినేట్టుగా రెండుసార్లు అనుకుంది. "ఈ ఎఱ్ఱచీర కాస్తా పాతబడిపోయింది. వెలిసిపోయి కట్టుకుంటే వెలాతెలాపోతోంది. ఇహ పెట్టె అడుగున పడెయ్యాలి" అంటూ.

అయినా రావమ్మ మౌనంగా దాని పని అది చేసుకు వెళ్ళిపోయింది- సావి త్రమ్మకి వొళ్ళు మండుకొచ్చింది. "ఉహ ! చాలావరకే వుందే ! కానీ, అనుభవించే అదృష్టం దానికిమాత్రం వుండద్దూ !" అనుకుంది నీరసంగా.

మరో వారం గడిచి పోయింది. రావ మ్మకి పాతచీర ఇచ్చే వుద్దేశాన్ని సావి త్రమ్మ మర్చిపోలేకుండా వుంది.

ఆ సాయత్రం పనిముగించి ఇంటికి పోబోతున్న రావమ్మ "అమ్మా" అంటూ నసుగుతూ నిలబడింది.

"ఏవిటీ !" అంది సావిత్రమ్మ.

"ఏంలేదమ్మా" మీదో పాతచీరుంటే పడెయ్యండమ్మా. రెండో చీర ముక్క లేక మహా బాధగా వుందమ్మా" అంది రావమ్మ ప్రాధేయపూర్వకంగా.

సావిత్రమ్మకి బిగబట్టిన నరాలన్నీ సళ్ళిచ్చినట్లనిపించింది. ఆశ్చర్యంగా, ఆనందంగా, ఓరగా రావమ్మవైపు చూసింది.

"ఊ, ఇప్పటికి దిగొచ్చావన్నమాట" అనుకుంది తనలో తను తలూపుకుంటూ.

"చూస్తాలే. చూసి వుంటే ఇస్తాను. ఇప్పటికిప్పుడు కావాలంటే ఎక్కడి నుంచి వస్తాయి" అంది బింకంగా సావి త్రమ్మ.

రావమ్మ జవాబు చెప్పకుండా తలొంచుకుని వెళ్ళిపోయింది. "పిచ్చి ముండ" ఇవాళ లేని పాతచీర రేపు మాత్రం ఎక్కడినించి వస్తుందని అడగ లేదు, ఇంకా నయం, అనుకుని నవ్వు కుంది సావిత్రమ్మ.

పులిలాగా ఇంటికొచ్చిన సావిత్రమ్మ భర్తకి ఆ రోజు భార్య చాలా ప్రస న్నంగా, సరదాగా వున్నట్లు తోచింది. కళ్ళజోడు తీసి ఓసారి భార్యని పరీ క్షగా చూసి తిరిగి కళ్ళజోడు పెట్టు

కుంటూ "ఏవిటి సంగతీ?" అంటూ కళ్ళతోనే ప్రశ్నించాడు.

సావిత్రమ్మ సరదాగా నవ్వి "ఆ ఏం లేదు. ఓ పాతచీర కావాలని ఆ రావమ్మ నా ప్రాణం తీస్తోంది! ఓ చీర చూసి పడెయ్యాలి దానికి" అంటూ లోపలికి పోయింది సావిత్రమ్మ.

సావిత్రమ్మ భర్త లోపలికి పోతున్న భార్యవంక పరీక్షగా చూసి, అయోమయంగా ఇంటికప్పుకేసి చూస్తూ, దీని భావమేమి తిరుమలేశ" అనుకుంటూ సిగరెట్టు కాల్చుకోసాగాడు.

* * *

మరో రోజు గడిచింది. ఇంకోరోజు వెళ్ళిపోయింది. ఆ తరువాత రోజుకూడా గడిచిపోయింది. సావిత్రమ్మ చీరమాట ఎత్తలేదు. ఇవ్వనూలేదు. రావమ్మ మళ్ళీ ఆ విషయం కదవనూ లేదు. క్షణక్షణానికి హెచ్చిపోతుండే బెజవాడ ఎండలాగా సావిత్రమ్మ కోపం పెరగసాగింది, రావమ్మని చూసినప్పుడల్లా

నాలుగోనాడు పక్కింటి సుందరమ్మ పిన్నిగారొచ్చింది పెత్తనానికి. ఆవిడ పింతల్లి ఆడపడచు కోడలి వొదినగారు ఏవిధంగా మొగుడితో దెబ్బలాడి పుట్టింటికి లేచిపోయిందో వైన వైనాలుగా వర్ణించి, లేవబోతూ పెరట్లో బట్టలుతుకుతున్న రావమ్మని, దాని చిరుగుల చీరని చూసింది సుందరమ్మగారు.

"చూశావా సావిత్రీ, మీ పనిదాని

పెంకెతనం ! వారంరోజులుగా నా ప్రాణం తీసి, నా ఎఱ్ఱంచు పచ్చచీర లేదూ ?! నడిపాతది, అది కాస్తా పట్టుకుపోయింది. ఇచ్చేవరకు నా గొంతుమీద కూర్చుందనుకో" అంది సుందరమ్మ పిన్నిగారు తనకే ఓ మహా సామ్రాజ్యం ఉండి వున్నట్టయితే దాన్ని అలాగ్గా దారినపోయేవాడికి దానం చేసినంత ఘనంగా.

సావిత్రమ్మకి రావమ్మని చూస్తే వొళ్ళు మండుకొచ్చింది. కోపం తారాస్థాయిని అందుకోసాగింది. అది చీర కోసం తన గొంతుమీద కూర్చోనూ లేదు ! పైగా రెండోసారయినా తనని అడగన్నా లేదు ! పొగరుమోతు !

"వీళ్ళంతే పిన్నిగారూ. మా ఇది వరకు పనిదానికి ఎన్ని పాత బట్ట లిచ్చానో ఆ పరమాత్ముడికే తెలుసు. చీరలేనా ! నిక్కర్లేనా ! చొక్కాలేనా ! ఇచ్చేవరకూ నన్ను తిండిగూడా తిన్నిచ్చేది గాదనుకోండి ! పుండు సలిపినట్టుగా సలిపేది. అయితే ఏం ? విశ్వాసమా ఏమన్నా నా వీళ్ళకి ! ఎప్పటికప్పుడే పరగడుపు" అంది సావిత్రమ్మ కోపంగా రావమ్మ ఉన్నవైపు చూస్తూ.

రావమ్మ పిన్నిగారి మాటలూ వింది. సావిత్రమ్మ మాటలూ వింది. కానీ అది మరొక్క మాటకూడా మాట్లాడకుండా పని ముగించి వెళ్ళిపోయింది. సావిత్రమ్మకి పుండుమీదకారం రాచుకున్నట్టయింది. అసలు దాని తల్లో ఏముందో కూడా ఆవిడకి అర్థంగాకుండా పోయింది.

* * *

ఆ సాయంత్రం రావమ్మ అవతారం చూసి సావిత్రమ్మ కళవళపడి పోయింది. అది రోజూ కట్టుకొచ్చే చీరలోని సగం ముక్కని మాత్రమే ఒంటి పొరని చుట్టుబెట్టుకొచ్చింది.

"ఏవిటే ? ఈ అవతారం ?" అంటూ గద్దించి అడిగింది సావిత్రమ్మ.

రావమ్మ జాలిగా తన కథ చెప్పింది. అది పొయిదగ్గరగా పడుకుని నిద్దరోతుంటే అగ్గంటుకుని సగం చీర పైగా కాలిపోయిందట ! మరో గుడ్డ లేక, ఆ మిగిలిన సగం ముక్కనే చుట్టబెట్టుకుని పని మానితే సావిత్రమ్మ వూరుకోదేమోనన్న భయంతో పనిలోకి వచ్చిందట !

సావిత్రమ్మ దాని తీరు, మాటలు చూసి కరిగి నీరయింది జాలితో. ఛా ఛా పాపం దానితో తనకి పట్టుదలేవిటి ! పాపం సరిఅయిన బట్టలు కూడా లేక ఎంత అవస్త పడుతోందో ! ఏమో ఎవరు చెప్పొచ్చారు. ఎవరికాలం ఎప్పుడు ఎట్టా మారుతుందో పాపం ఒకప్పుడు బాగా బ్రతికిన మనిషేమో ! అందుకే ఒకటికి పదిసార్లు అడగటానికి అభిమాన పడుతోందేమో అనుకుంటూ ఓ క్షణం

జాలితో కొట్టుకుపోయింది సావిత్రమ్మ. పైగా అది స్వప్నసుందరిలాగా ఒంటి పొరన చీరకట్టుకుని ఇంట్లో తిరుగు తుంటే ఇంకేమన్నా వుందా!

"అయ్యో పాపం. ఓసి పిచ్చిరకమా, మళ్ళీ చీర సంగతి గుర్తన్నా చెయ్య లేదేమే, ఇంటికి పోయేప్పుడు గుర్తు చెయ్యి. ఓ పాతచీర పడేస్తాను" అంది దయగా రావమ్మతో.

ఆ సాయంత్రం రావమ్మ ఇంటి కెడుతూ చీర సంగతి గుర్తుచేసింది సావిత్రమ్మకి.

"ఉండు వస్తున్నా" అంటూ సావిత్రమ్మ లోపలకొచ్చి పెట్టె తెరిచింది. రావమ్మకిద్దామని పదిరోజులనాడు విడిగా తీసిపెట్టిన చీర, రవిక, నిక్కర్లు చొక్కాలు బయటకి తీసింది. చేత్తో పుచ్చుకుని గుమ్మంవరకు వచ్చిన సావిత్రమ్మ ఏదో ఆలోచన తోచి, చేతిలోని దొంతిలోంచి నిక్కర్లు, చొక్కాలు తీసి పెట్టెలో పడేసింది "అసలు ఇన్ని బట్టలు పాతవయినా సరే ఒక్కసారిగా ఇచ్చామంటే అలుసయి పోతాం. అసలది మరోసారి అడిగినప్పుడు పిల్లల బట్టలు ఇవ్వవచ్చులే" అనుకుంటూ సావిత్రమ్మ వెలిసిన పాతచీర, రెవిక పుచ్చుకుని గుమ్మంవరకు వచ్చింది కాస్తా మళ్ళీ ఆగిపోయింది. చీరని ఇటూ ఇటూ తిప్పి పరీక్షగా చూసింది.

"చీరమాత్రం దుమ్మలాగా వుందే! ఒక్క చిరుగన్నా పట్టలేదే. కాస్తంత రంగు పోతే మాత్రమేం! రాత్రిపూట కట్టుకోవచ్చు లేకపోతే ఏ జరీచీరతో చాటుగానో స్టీలుగిన్నెల వాడికిస్తే ఏ దుమ్మలాంటి గిన్నో, గ్లాసో ఇచ్చి పోతాడు! అసలయినా ఈ పని వాళ్ళకి అడగంగానే ఇవ్వకూడదు, విశ్వాసమా ఏమన్నానా?" ఇదీ చీర కాస్తా పుచ్చుకుని రేపటినుంచి మానేసినా మానేస్తుంది. చీర సంగతి ఇంకోమారు చూడచ్చులే'' అనుకుంటూ చీర తీసి పెట్టెలో పడేసి, రెవికమాత్రం చేత్తో పుచ్చుకుని బయటికి వచ్చింది సావిత్రమ్మ.

''రావమ్మా'' ఇప్పటికిప్పుడు పాత చీరలేం లేవుగానీ, ఈ రెవిక తీసుకో. గట్టిదే రెవిక. చిరుగన్నా పట్టలా. కాస్తంత రంగు వెలిసింది. అంతే, అంటూ రెవికన భద్రంగా రావమ్మకి దానం చేసింది సావిత్రమ్మ.

రావమ్మ ఒక్కసారయినా కళ్ళెత్తయినా చూడకుండా రెవిక చేత్తో పుచ్చుకుని వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిపోతున్నదాన్ని చూస్తుంటే సావిత్రమ్మని మరో మారు జాలి చుట్టుముట్టింది. "ప్చ్ ప్చ్. పాపం ఆ చీర కూడా ఇవ్వాల్సింది. ఎంత అవస్త పడుతోందో ఏమో పాపం కట్టుకోవడానికి గూడా లేకుండా? ప్చ్. ఈ సారి అడిగితే తప్పకుండా ఇవ్వాలి'' అనుకుంది సావిత్రమ్మ స్వగతంతో రావమ్మ మళ్ళీ చీరనిగురించి అడగటం కోసం ఆతృతగా ఎదురు చూస్తోంది సావిత్రమ్మ."